క్లుప్తంగా

చిన్నారులూ.. తస్మాత్ జాగ్రత్త



ముట్పూర్ పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా గుంతలు

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఇదివరకు గ్రామపంచాయతీ వారు ఏర్పాటు చేసిన ఇంకుడుగుంతల నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతో ఈ గుంతలు పడ్డాయని గ్రామస్తులు తెలిపారు. ఈ గుంతల్లో చిన్నారులు పడితే ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

ధ్యానంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

కేశంపేట: ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి తెలియజేశారు. సోమవారం మండల పరిధిలోని కాకునూర్, చింతకుంటపల్లి, పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి, వేమునర్వ గ్రామ శివారులోని చౌదరిగూడ గ్రామాల్లో ధ్యానంపైన అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ధ్యానం చేయడం వల్ల తలనొప్పి నుంచి క్యాన్సర్ వరకు రోగాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ధ్యానం చేయడం వల్ల మనిషిలో ఆలోచన విధానాల్లో, మాట్లాడే మాటల్లో, వ్యవహార జీవితంలో ఎన్నో మార్పులు వస్తాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో శివకుమార్, బాలకృష్ణారెడ్డి, లక్ష్మి, వెంకటలక్ష్మి, జ్యోతి, స్వప్న, రాధ, శైలజ, హేమంత్, రాములు, గోపాల్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, వేణు పాల్గొన్నారు.

వైభవంగా బుగ్గరామేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న ప్రజలు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని దేవాదాయ–ధర్మాదాయ శాఖ ఈఓ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ ఏశాల చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో బుగ్గరామేశ్వరస్వామి రథోత్సవం ఉదయం అంగరంగ వైభవంగా నిర్వహించా రు. కొమరబండ గ్రామం నుంచి బుగ్గరామేశ్వర స్వామి దేవాలయం వరకు భక్తులు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తూ కోలాహలంగా పాటలు పాడుకుంటూ రథోత్సవంలో పాల్గొన్నారు. మరో మూడు రోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, గ్రామస్తులతో పాటు మండల ప్రజలు భారీగా తరలి వచ్చారు.

కుంగ్‌ఫూలో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు

కొందుర్గు: న్యూ పవర్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన స్టేట్ లెవల్ కుంగ్ ఫూ కరాటే టోర్నమెంట్‌లో కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల విద్యార్థులు ప్రతిభ చాటారని మాస్టర్లు రమేష్, రాజు సోమవారం తెలిపారు. ప్రతిభ చూపిన కొందుర్గు విద్యార్థులు సహిద్, కరుణాకర్, అభిలాష్‌లను కొందుర్గు న్యూమాంక్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్ వారు అభినందించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిర, కాస్లాబాద్, వీరన్నపేట విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

బీజేపీకి రాజీనామా

కొందుర్గు: తనకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదని అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం బీజేపీ మండల కమిటీ ఉపాధ్యక్షుడు తాండ్ర ప్రేమ్‌కుమార్ ప్రకటించారు. 2009 నుంచి బీజేపీకి ఎంతో సేవచేశానని, అంకితభావంతో పని చేసినా పార్టీలో ప్రాధాన్యత లభించడం లేదన్నారు. పార్టీ సభ్యత్వానికి, మండల ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అయితే మంగళవారం కొందుర్గులో నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ప్రేమ్‌కుమార్ బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

అభివృద్ధిలో మనమే టాప్

- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- కష్టపడేవారికి పార్టీలో గుర్తింపు
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య
- మొయినాబాద్‌లో ఆత్మీయ సమ్మేళన సభ



ఆత్మీయ సమ్మేళన సభలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

మొయినాబాద్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్‌లోని అంజనాదేవి గార్డెన్‌లో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించి ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు వంటి పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం చేయాలన్నారు. పార్టీకోసం పనిచేసే కార్యకర్తలు, నాయకులకు గుర్తింపు లభిస్తుందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని దేశమంతా విస్తరించి అన్ని రాష్ట్రాల్లో తెలంగాణ పథకాలను అమలు చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. అందుకోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా తోలుకట్ట గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ పార్టీల నాయకులు కొంత మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న, మండల పార్టీ ఉపాధ్యక్షుడు జయవంత్, ఏఎంసీ వైస్ చైర్మన్ రవుఫ్, డైరెక్టర్లు రవీందర్, మహేష్‌యాదవ్, మాజీ వైస్ చైర్మన్ డప్పు రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బిలాల్, సర్పంచ్‌లు శ్రీనివాస్, మనోజ్‌కుమార్, శోభ, లావణ్య, నవనీత, స్వప్న, నాయకులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఆడపిల్లలను కాపాడుకుందాం..

ఐసీడీఎస్ చేవెళ్ల ప్రాజెక్టు సీడీపీఓ శోభారాణి

చేవెళ్ల: ఆడపిల్లలను కాపాడుకుందాం వారిని గౌరవంగా సమాజంలో ఎదిగేందుకు సహకరిద్దామని ఐసీడీఎస్ చేవెళ్ల ప్రాజెక్టు సీడీపీఓ శోభారాణి అన్నారు. మండలంలోని ఆలూరు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీల ఆధ్వర్యంలో సోమవారం ఆలూరు గ్రామంలో మహిళలు, పిల్లలతో కలిసి బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ.. ఆడపిల్లలను కాపాడుకొని వారిని బాగా చదివించాలని కేంద్ర ప్రభుత్వం బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. ఇందులో భాగంగా ఆడపిల్లల రక్షణ, బాలికల పరిశుభ్రత, పోషకాహారం, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ప్రతి ఆడపిల్ల తప్పనిసరిగా చదువుకోవాలని చెప్పారు. ఆడపిల్లలు పుట్టిన తల్లిదండ్రులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తూ ఆడపిల్ల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా సంవత్సరం నిండిన బాలికలకు కేక్ కటింగ్ చేయించి నూతన దుస్తులను అందజేశారు. అలాగే, పిల్లలను ఊయల వేసే కార్యక్రమం, వెల్ బేబిషో నిర్వహించారు. 3నుంచి 6 సంవత్సరాల పిల్లలకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీల ద్వారా పిల్లలకు పూర్తిగా ఆరోగ్యకరమైన పోషకాహారం అందించడంతో పాటు వారిని పాఠశాలలకు వెళ్లేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలూరు సర్పంచ్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శకుంతల, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, కిశోర బాలికలు, గర్భిణులు బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేయిస్తున్న శోభారాణి, సర్పంచ్, సూపర్‌వైజర్లు

రోడ్లతోనే గ్రామాల అభివృద్ధి

జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్



పనులను ప్రారంభిస్తున్న గణేష్, సర్పంచ్

నందిగామ: రోడ్లు బాగుంటేనే గ్రామాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతాయని జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని వీర్లపల్లి రోడ్డులోని ఎల్లమ్మ రాళ్లకాలనీలో సోమవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో సర్పంచ్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులకు జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్ ముఖ్యఅతిథిగా హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. మండల కేంద్రమైన నందిగామతో పాటు అనుబంధ గ్రామాలు ఇప్పటికే అన్ని రకాలుగా అభివృద్ధి చెందాయని, సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు సాధ్యమైనంత వరకు పూర్తయ్యాయని అన్నారు. మిగిలిపోయిన పనులను విడతల వారీగా పూర్తి చేసి ఆదర్శ మండలంగా, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మిగిలిపోయిన పనులను విడతల వారీగా పూర్తి చేసి ఆదర్శ మండలంగా, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

అభివృద్ధి ఎక్కడ..?

గ్రామంలో ముఖాలు చూసి బొట్లు పెడుతున్నట్లుగా అభివృద్ధి పనులు చేస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని గ్రామానికి ఓ వ్యక్తి సర్పంచ్‌ను నిలదీశారు. కొన్ని వార్డుల్లో మాత్రమే పనులు చేస్తూ మిగతా వార్డులను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డులోని సమస్యలు పరిష్కరించాలని గత కొంతకాలంగా అడుగుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో సర్పంచ్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు ఈ నెలతో గడువు ముగుస్తుందనే ఉద్దేశంతో పనులు చేస్తున్నామని, మిగతా వార్డుల్లో జీపీ నిధులతో పనులను పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుమార్ గౌడ్, వార్డు సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, ఈశ్వర్ యాదవ్, నాయకులు నర్సింహా, సంజీవ్, మల్లేష్, శివ కుమార్ గౌడ్, రమేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిపై కేంద్రం వివక్ష

- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: రాష్ట్రాభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆదేశాల మేరకు మండలంలో రెండవ రోజు కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి, కాకునూర్, తొమ్మిదిరేకుల, లింగంధన, నిర్దవెల్లి, బోధునంపల్లి, కేశంపేట, చౌలపల్లి, సుందరపురం, చింతకుంటపల్లి, వేములనర్వ, దేవునిగుడితండా, లేమామిడి గ్రామాల కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు, రైతు బీమా పథకాలను అమలు చేస్తూ రైతు పక్షాన నిలిచిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం అమలు సంక్షేమ పథకాలను గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. అనంతకుముందు బీఆర్‌ఎస్ కార్యకర్తలు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను మూడవసారి భారీ మెజార్టీతో గెలిపించి మంత్రి అయ్యేలా చేస్తామని శపథం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్ యాదవ్, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మినారాయణగౌడ్, మాజీ జెడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు, రాంబాల్‌నాయక్, నారాయణరెడ్డి, అనురాధ, వెంకట్‌రెడ్డి, నవీన్‌కుమార్, శంకర్‌నాయక్, జమాల్‌ఖాన్, వేణుగోపాలచారి, రాములు నాయక్, జగన్‌నాయక్, శ్రీను, అంజిరెడ్డి, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

మొయినాబాద్‌రూరల్: భక్తిభావంతో మానసిక ప్రశాంతత కల్గుతోందని ఎమ్మెల్యే కాలెయాదయ్య, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవియాదవ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు మంజుల, మాజీ మంత్రి కృష్ణయాదవ్‌లు పేర్కొన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి సమేత గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, శివలింగ, నంది, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం ఆలయ నిర్మాణ దాత బాత్కు శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భక్తిభావన ప్రజల్లో కలిగినప్పుడే మనసు శాంతి కలుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అనంతరం రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ.. గ్రామాల్లో దేవాలయాలు అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భక్తులు దైవాన్ని నమ్ముకుంటే మానసిక ప్రశాంతత కల్గుతోందని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీతారామాంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన

శంకర్‌పల్లి: మండలంలోని అంతప్పగూడ గ్రామంలో సోమవారం సీతారామాంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారాంమాంజనేయ స్వామి వారితో పాటు రాధాకృష్ణ, లక్ష్మీనర్సింహా, అనంతపద్మనాభ, దత్తాత్రేయ, సూర్యభగవాన్, సత్యనారాయణ స్వామి, రుక్మిణీ పాండురంగా, వేంకటేశ్వర స్వాముల విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. అలాగే, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేపట్టారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అలివేలు, ఎంపీటీసీ మేఘన, మాజీ ఎంపీటీసీ దశరథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

యుద్ధ విద్యలతో ఆత్మరక్షణ

షాద్‌నగర్‌టౌన్: ఆపద సమయంలో మనల్ని మనం రక్షించుకునేందుకు యుద్ధ విద్యలు ఎంతగానో దోహదపడతాయని న్యూపవర్ కుంగ్‌ఫూ అకాడమీ మాస్టర్ బాల్‌రాజ్ అన్నారు. పట్టణంలోని గణేష్ గార్డెన్‌లో సోమవారం న్యూ పవర్ కుంగ్ ఫూ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏదో ఒక చోట మహిళలపై, బాలికలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలను తీసుకువచ్చినా మహిళలపై జరుగుతున్న దాడులను నిలువరించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలను కఠినంగా అమలు చేయకపోవడంతో ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని తెలిపారు. మహిళలు యుద్ధ విద్యలు నేర్చుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. కార్యక్రమంలో రమేష్, ఆది, లింగం, సాయినాథ్, రాజు, నందు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు రాజకీయాల్లో రాణించాలి

ఆ సంఘం మండల అధ్యక్షుడు రాజు ముదిరాజ్



అప్పారెడ్డిగూడ సంఘం నూతన కమిటీ

నందిగామ: ముదిరాజ్‌లు విద్య, ఉద్యోగాలు, వ్యాపారాలతో పాటు రాజకీయాల్లో రాణించాలని ముదిరాజ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మేకం రాజు ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో సోమవారం గ్రామ ముదిరాజ్ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మేకం రాజు ముదిరాజ్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు కేవలం కులవృత్తికి మాత్రమే అలవాటు పడకుండా అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు.

నూతన గ్రామ కమిటీ

గ్రామకమిటీ అధ్యక్షుడిగా కుమార్, ఉపాధ్యక్షుడిగా యాదగిరి, కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా గణేష్, యూత్ కమిటీ అధ్యక్షుడిగా రాము, ఉపాధ్యక్షుడిగా రాఘవేందర్, శేఖర్, కిషోర్, సిద్దు తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందించి ఘనంగా సన్మానించారు.

గ్రామాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

సర్పంచ్ పులుసుమామిడి లక్ష్మి



పంచాయతీ కార్యవర్గాన్ని సన్మానించిన గ్రామస్తులు

షాద్‌నగర్: గ్రామాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామని సర్పంచ్ లక్ష్మి అన్నారు. జాతీయ పంచాయతీ అవార్డు పొందిన అయ్యవారిపల్లి సర్పంచ్ పులుసుమామిడి లక్ష్మి, పంచాయతీ సభ్యులను, పంచాయతీ సిబ్బందిని సోమవారం గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ... గ్రామస్తుల సహాయ సహకారాలతోనే గ్రామానికి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ వికాస్ అవార్డు వచ్చిందన్నారు. ఈ అవార్డు స్ఫూర్తితో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేసి ఉత్తమ గ్రామ పంచాయతీగా నిర్మించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అన్ని వార్డుల్లో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముజఫర్ ఉన్నిసా, ఉప సర్పంచ్ ఉమా మహేందర్ రెడ్డి, వార్డు సభ్యులు విజయేందర్‌రెడ్డి, గాలి నర్సింలు, మంజుల, అనంతమ్మ, గ్రామస్తులు రమేష్, మోహన్‌రెడ్డి, చంద్రకాంత్, వెంకటలక్ష్మి, అంజమ్మ, నర్సింలు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్లు ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి



హెల్మెట్లను పంపిణీ చేస్తున్న వెంకట్ రెడ్డి తదితరులు

నందిగామ: ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్‌ను ధరించి ప్రాణాలను కాడుకోవాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని పాత జాతీయ రహదారిపై బీఏఎం కళాశాల విద్యార్థులు సోమవారం ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ వెంకట్‌రెడ్డి హాజరై హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. షాద్‌నగర్‌లోని బీఏఎం కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు తమ తోటి స్నేహితులు జంగారి మహేందర్, కందాడ ఆనంద్‌లు హెల్మెట్లు ధరించకుండా ద్విచక్ర వాహనాలపై వెళ్తూ ప్రమాదానికి గురై ఇటీవల మృత్యువాత పడ్డారు. తమ స్నేహితులు మృతి చెందినట్లుగా మరొకరు మృతి చెందొద్దని హెల్మెట్లను ఉచితంగా అందజేయడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ కుమార్‌గౌడ్, విద్యార్థులు ప్రశాంత్ గౌడ్, శరత్ యాదవ్, చందు, చోటు, విక్రం, శ్రీను, రఘు, శ్రీకాంత్, మల్లేష్, శంకర్, చరణ్, రమేష్, శ్రీకాంత్, రవి పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు 'కంటి వెలుగు'

జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి



శిబిరాన్ని పరిశీలిస్తున్న వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: అంధత్వ నివారణకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తుందని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామంలో ఏర్పాటు చేసిన రెండవ విడత కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల కంటి సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఉచిత కంటి వెలుగును చేపట్టడం జరిగిందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కంటి సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి అద్దాలను పంపిణీ చేయడంతో పాటుగా అవసరమైన వారికి కంటి ఆపరేషన్ చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింలు, ఉపసర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అశోక్‌కుమార్, సరళకుమార్, రామేశ్వరి, అన్నపూర్ణ, పద్మమ్మ, చెన్నయ్య, కుమార్, లక్ష్మమ్మ, భవానిసింగ్, నరేష్, వరలక్ష్మి, వీరమణి, సాబేరా, లక్ష్మమ్మ, సంపూర్ణ పాల్గొన్నారు.

దారి విడిచి ప్రహరీ నిర్మించండి



రైల్వే అధికారిని కలిసిన కాలనీవాసులు

షాద్‌నగర్: పట్టణంలోని 22వ వార్డు రతన్ కాలనీలో రైల్వే క్వాటర్స్ వెనక ఉన్న ఇళ్లకు వెళ్లేందుకు దారి విడిచి రైల్వే అధికారులు ప్రహరీగోడను నిర్మించాలని కాలనీవాసులు కోరారు. సోమవారం పట్టణంలోని రైల్వేశాఖ పీడబ్ల్యూ కార్యాలయానికి బీఆర్‌ఎస్ నేత యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో పలువురు కాలనీవాసులు వెళ్లి రైల్వే ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా యాదగిరియాదవ్ మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లక్రితం సుమారు 40మంది నిరుపేదలు ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. రైల్వే అధికారులు రతన్ కాలనీలోని రైల్వే క్వాటర్స్ వెనకాల ప్రహరీగోడ నిర్మిస్తే ఇళ్లలోకి వచ్చి వెళ్లేందుకు దారి ఉండదని తెలిపారు. ఆపద సమయంలో కనీసం అంబులెన్స్ వచ్చి వెళ్లే విధంగా దారి విడిచి ప్రహరీ గోడను నిర్మించాలని కోరారు. నిరుపేదల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రైల్వే శాఖ అధికారులు ప్రహరీ నిర్మాణం చేయాలని కోరారు. రైల్వే అధికారిని కలిసిన వారిలో కాలనీవాసులు శ్రావణ్ కుమార్, నర్సింలు యాదవ్, నరేష్, అలీ, ఉదయ్, హరి తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి

పార్టీ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి



సమ్మేళనానికి బయలుదేరిన నాయకులు

మొయినాబాద్‌రూరల్: సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కాలె యాదయ్య గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని జిల్లా బీఆర్‌ఎస్ యువసేన నాయకులు చింతకింది ప్రవీణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఎత్‌మార్‌పల్లి, కేతిరెడ్డిపల్లి, నక్కపల్లి, తోల్‌కట్ట, సజ్జన్‌పల్లి, కనకమామిడి ఆయా గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆత్మీయ సమ్మేళనానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎత్‌మార్‌పల్లి గ్రామంలో నాయకులు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన ర్యాలీ నిర్వహించి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న నాయకుడు కేసీఆర్ అని అన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎత్‌మార్‌పల్లి సర్పంచ్ గుండాల నవనీతారాజు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో లబ్ధి

బీజేపీ కార్యవర్గ సభ్యుడు ప్రకాష్

శంకర్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మహాలింగపురం గ్రామంలో నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీజేపీ ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం ఎంతో కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న రైతు వేదికలు, వైకుంఠధామాల నిర్మాణం పనుల్లో కేంద్ర వాటా కూడా ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, శంకర్‌పల్లి మాజీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు నందు, శ్రీనివాస్‌రెడ్డి, పవన్ పాల్గొన్నారు.